

సమగ్ర కులగణనకు సమాయత్తం

- 6వతేదీ నుంచి నిర్వహణకు యంత్రాంగం ఏర్పాట్లు
- 60 రోజుల్లో ప్రక్రియ పూర్తికి కార్యాచరణ
- ఎన్యూమరేటర్ల నియామకానికి కసరత్తు
- 75 ప్రశ్నలతో సర్వే పత్రం విడుదల
- ఉమ్మడి జిల్లాలో సుమారు 42లక్షల మంది బీసీలు



హనుమకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర సామాజిక సర్వే (సమగ్ర కుల గణన) సన్నాహాలు మొదలయ్యాయి. వచ్చే నెల 6వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో ఉమ్మడి జిల్లాలోని అధికార యంత్రాంగం ఆ ఏర్పాట్లలో నిమగ్నమైంది. ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువు 60 రోజుల్లో ఉమ్మడి జిల్లాలో సుమారు 42లక్షలమంది బీసీల వివరాలను సేకరించేందుకు సిద్ధమైంది. అయితే పారదర్శకంగా కులగణనను నిర్వహించేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోనున్నారు. మరోవైపు అన్ని బీసీ సంఘాలు సమగ్ర కుల గణనను పక్కాగా నిర్వహించేలా చూడటంతో పాటు బీసీలు ఈ కులగణనలో విధిగా పాల్గొనేలా చేయడానికి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాయి. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఇతర వర్గాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించేందుకు వీలుగా గణన చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటితో పాటు సామాజిక స్థితిగతులు, ఆర్థిక పరిస్థితి తదితర అంశాలపై అంచనాకు వచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీసీలు 56 శాతం అంటే సుమారు 42 లక్షల మంది వరకు ఉండవచ్చునని బీసీ సంఘాలు అంచనా వేస్తున్నాయి. వరంగల్ జిల్లాలో బీసీలు అత్యధికంగా 58శాతం ఉన్నట్టు అంచనా. మహబూబాబాద్, ములుగు జిల్లాలో తక్కువగా ఉన్నారు. బీసీలో మొత్తం 126 కులాలు ఉండగా వీరిలో పద్మశాలి, మున్నూరుకాపు, యాదవ, గౌడ్లు, విశ్వబ్రాహ్మణ, రజక, బెస్త, గంగపుత్ర, నాయి బ్రాహ్మణ, వడ్డెర, పెరిక, కుమ్మరి, వడ్రంగి, కూనపులి తదితర కులాలు వారు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కువగా ఉన్నారు. వీరితో పాటు ఉపకులాలు, ఆశ్రిత కులాల వారు సైతం గణనీయంగానే ఉన్నారు. ఉపకులాలు, ఆశ్రిత కులాల వారు బతుకు తెరువు కోసం ఎక్కువగా హనుమకొండ, వరంగల్ జిల్లాలకు వలస వచ్చి స్థిరపడ్డారు. వీరిలో ఎక్కువగా సంచార జాతుల వారు ఉన్నారు. పొట్టకూటి కోసం ఆయా ప్రాంతాలకు తరుచూ వలస వెళ్లే వీరి గణన విషయం కొద్దిగా ఇబ్బందిగా ఉండే అవకాశం ఉంది.

సిబ్బంది నియామకం

ఇంటింటి సర్వే చేసేందుకు ఎంతమంది ఎన్యుమరేటర్లు అవసరమో అంచనా వేస్తున్నారు. 60 రోజుల్లో గణన పూర్తి చేయాలని ఆదేశించిన నేపథ్యంలో అందుకు తగ్గట్లు ఉమ్మడి జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా శాఖల్లో పని చేసే సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. గణనకు ఎంత మంది ఎన్యూమరేటర్లు అవసరమవుతారు? ఎన్ని బృందాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది? ఏప ప్రభుత్వ శాఖల నుంచి ఎన్యూమరేటర్లను సేకరించాలి? అన్ని అంశాలపై ప్రస్తుతం అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2011జనాభా లెక్కల ప్రకారం ఉన్న వివరాలను పరిగణలోకి తీసుకుని బృందాలను, ఎన్యూమరేటర్లను నియామకం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 1500 జనాభాకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, సంబంధిత బృందంలో సుమారు 10మంది ఎన్యూమరేటర్లను నియమించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు నెలల్లో కుల గణన సర్వేను పకడ్బందీగా పూర్తిచేసి నివేదించేందుకు సిద్ధమవుతున్నారు.

బీసీల లెక్కింపు ఇదే మొదటి సారి..

ప్రతీ పదేళ్లకొకసారి నిర్వహించే జనాభా లెక్కలతో పాటు ఇతర సందర్భాల్లో ప్రభుత్వానికి అవసరమైన గణాంకాలు తీసుకున్నా కుల గణన మాత్రం చేపట్టలేదు. దీనితో బీసీలు ఎంత మంది ఉన్నారు? ఏ కులం వారు ఎంత మంది ఉన్నారు? కచ్చితమైన లెక్కలు లేవు. దీనితో బీసీలు కచ్చితంగా ఎంత మంది ఉన్నారనే విషయంలో ఇప్పటి వరకు స్పష్టత లేదు. ఇది బీసీ వర్గాల్లో అసంతృప్తికి కారణమైంది. 2011 జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ జనాబా గుర్తించారు. బీసీ గణాంకాలు బయట పెట్టలేదు.

ఏకమవుతున్న కుల సంఘాలు

బీసీ కులగణన నిర్వహిస్తున్న నేపథ్యంలో బీసీ కుల సంఘాలన్నీ ఏకమవుతున్నాయి. కులగణన పక్కాగా పారదర్శకంగా జరిగేలా చూడడానికి తమ వంతుగా గణన జరిగేంత కాలం నిరంతర నిఘా వేసి ఉంచాలనే నిర్ణయానికి వచ్చాయి. ఈ మేరకు కుల సంఘాల నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అంతే కాకుండా బీసీ కుల గణన వల్ల కలిగే ప్రయోజనాలు, కులగణనలో భాగస్వాములు కావలసిన ఆవశ్యకత గురించి బీసీలకు అవగాహన కలిగించేందుకు అప్పుడే గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో బీసీ విద్యావంతులు, కుల సంఘాల ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహిస్తున్నాయి.

నాటి నుంచి బీసీ సంఘాల నేతలు పోరాటం చేస్తూనే ఉన్నారు. ఉన్నత న్యాయ స్థానం సైతం బీసీ జనాభా తేల్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే ప్రభుత్వం కుల గణనకు సంబంధించిన ఓ ప్రశ్నా పత్రాన్ని విడుదల చేసింది. మొత్తం 75 ప్రశ్నలుండగా.. పార్ట్ 1లో యజమాని కుటుంబ సభ్యులు వ్యక్తిగత వివరాలకు సంబంధించి 58 ప్రశ్నలు, పార్ట్ 2లో కుటుంబ వివరాలకు సంబంధించి 17 ప్రశ్నలు ఉంటాయి.

గణాంకాలు దేనికైనా అవసరమే..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా కుల గణనకు హామీ ఇచ్చింది. ఉద్యోగాల్లో బీసీలకు 29 శాతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34శాతం రిజర్వేషన్లు కల్పించాలని అభ్యర్థనలు వస్తున్నాయి. గతంలో పోలిస్తే ఓసీ జనాభా తగ్గి బీసీలు పెరిగినట్టు అంచనా వేస్తున్నారు. కులగణన చేస్తే పథకాల రూపకల్పనకు ఉపయోగపడుతుంది. త్వరలో నిర్వహించే సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకు ఇది ప్రామాణికం కానుంది.

జిల్లాకు రెండు పారామెడికల్ కోర్సులు

జనగామ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాకు రెండు పారా మెడికల్ కోర్సులు మంజూరయ్యాయి. జనగామ మెడికల్ కాలేజీకి అనుబంధంగా వీటిని కేటాయిస్తూ తెలంగాణ పారా మెడికల్ బోర్డు నిర్ణయం తీసుకుంది. 2024-25 సంవత్సరానికి రెండు కోర్సుల్లో కలిపి 60 సీట్లతో కోర్సులను నిర్వహించనున్నారు. రెండేళ్ల కాలపరిమితి ఉన్న ఈ కోర్సులను జనగామ మెడికల్ కాలేజీకి అనుబంధంగా కొనసాగించనున్నారు. ఇందులో భాగంగా జనగామ మెడికల్ కాలేజీలో డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్స్(డీఎంఐటీ), డిప్లొమా ఇన్ ఆప్తాలమిక్ అసిస్టెంట్ కోర్సులను నిర్వహించనున్నారు. వీటిల్లో ఒక్కో కోర్సులో 30 సీట్ల చొప్పున పారా మెడికల్ బోర్డు కేటాయించింది. ఈ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులకు నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా.. ఆసక్తి ఉన్న ఇంటర్మీడియట్‌లో బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులు నవంబరు 11 లోగా దరఖాస్తులు చేసుకోవాలని జనగామ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపీసీ విద్యార్థులు లేని పక్షంలో ఎంపీసీ విద్యార్థులకు, ఎంపీసీ విద్యార్థులు కూడా లేనిపక్షంలో ఇతర గ్రూపుల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

అభివృద్ధి పనుల సమగ్ర వివరాలు అందించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలతో చేపట్టిన అభివృద్ధి పనుల సమగ్ర వివరాలు పర్యవేక్షణ బృందానికి అధికారులు అందించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాల అభివృద్ధి పరిశీలించేందుకు కేరళ రాష్ట్రం తిరువనంతపురంలోని సెంటర్ ఫర్ రూరల్ మేనేజ్‌మెంట్, అండ్ డెవలప్‌మెంట్ నుంచి వచ్చిన జాతీయ స్థాయి మానిటరింగ్ బృంద సభ్యులు జుబేద్ కీవీస్, జన్సి లారెన్స్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యవేక్షణ బృందం 2024 నవంబరు 1 నుంచి 8 వరకు జిల్లాలో పర్యటించి సుమారుగా 12 కేంద్ర అభివృద్ధి పథకాల పనితీరును పరిశీలించనున్నట్లు తెలిపారు. జిల్లా లోని జనగామ, దేవరుప్పుల, స్టేషన్‌ఘన్‌పూర్, కొడకండ్ల మండలాలలో ఒక్కో మండలంలో 5గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పర్యవేక్షిస్తున్నందున సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో సరిత, డీఆర్‌డీవో వసంత, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు హనుమకొండకు బీసీ కమిషన్ రాక

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్రవ్యాప్త ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా శనివారం హనుమకొండ జిల్లాలో బీసీ కమిషన్ పర్యటన ఉంటుందని హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్యశారద శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. జనాభా ధామాషా ప్రకారం స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని, ఈ ప్రజాభిప్రాయ సేకరణలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మిలు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కుల సంఘాల ప్రతినిదుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని, ఈ సేకరణ ఉదయం 10 గంటలక ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులను బీసీ కమిషన్ బృందం స్వీకరిస్తుందని పేర్కొన్నారు. బీసీ కమిషన్ బృందం పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత మాదే

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా తీయించింది

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం

6

ధర్మసాగర్, వేలేరుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



ధర్మసాగర్‌లో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఘనంగా దీపావళి

- వెలుగులు విరజిమ్మిన లోగిళ్లు
- వ్యాపార సంస్థల్లో లక్ష్మీపూజలు



జనగామలో ఓ ఇంటి ఎదుట దీపాలతో..



జనగామ కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని జిల్లా వాసులుఘనంగా జరుపుకున్నారు. తారాజువ్వల మెరుపులనడుమ, చిచ్చుబుడ్ల కాంతులు విరజిమ్ముతూ గురు, శుక్రవారాల్లో భక్తిశ్రద్ధలతో వేడుకలు చేసుకున్నారు. తెల్లవారు జామున మంగళస్నానాలు ఆచరించి హారతులు తీసుకుని దీపావళి పర్వదినాన్ని జరుపుకున్నారు. కేదారీశ్వరి వ్రతాలు నోముకున్నారు. నిత్య సౌభాగ్యవతులుగా ఉండాలని మహిళలు అమ్మవారిని వేడుకన్నారు. వ్యాపారస్తులు తమ వ్యాపార సముదాయాల్లో లక్ష్మీపూజలు నిర్వహించారు. సంవత్సరాంతం అధిక లాభాలు రావాలని లక్ష్మీదేవిని వేడుకున్నారు. జిల్లా కేంద్రం మొదలు గ్రామీణ ప్రాంతాల వరకు దీపాల వెలుగులో మెరిసిపోయాయి. ప్రజలు చిన్నాపెద్దా తేడా లేకుండా బాణాసంచా కాల్చి వేడుకలు జరుపుకున్నారు. ఇంట్లో ఉదయాన్నే తియ్యదనంతో కూడిన పరమాన్నం చేసుకొని ఆనందించారు. చిన్నారులు కుటుంబ సభ్యులతో దుకాణాలకు వెళ్లి వారికి కావాలసిన బాణాసంచా కొనుగోలు చేశారు.

లక్ష్మీపూజల అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలను ఒకరినొకరు పంచుకున్నారు. లక్ష్మీ పూజల సందర్భంగా వ్యాపార, వాణిజ్య సంస్థలను విద్యుత్ దీపాలు, మట్టి ప్రమిదలలో దీపాలు వెలిగించి ఆనందించారు. అష్టైశ్వర్యాలతో తులతూగాలని లక్ష్మీదేవిని సేవించి వ్యాపారస్తులు వేడుకున్నారు. అమ్మవారికి కట్న కానుకలు సమర్పించి భక్తితత్వాన్ని చాటుకున్నారు. పర్వదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని బాణాపురం శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం, పాతబీటు బజారులోని శివాలయం, చీటకోడూరు శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం లో భక్తులు దైవదర్శనం చేసుకుని తరించారు.

చిత్రకారుడికి జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఉపేందర్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శివునిపల్లి పట్టణానికి చెందిన చిత్రకారుడు, గాయకుడు లయన్ మొగుదుంపురం ఉపేందర్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. గౌతమీ స్వర్ణనంది పురస్కారం 2024 అవార్డును గురువారం హైదరాబాద్ త్యాగరాయ గానసభలో నిర్వహించిన సభలో ఇటీవల నిర్వాహకులు వెంకటేశ్వర్లు, నగేష్, జబర్దస్త్ ఫేం వెంకీ మంకీ, సింగర్ సాకేత్, దైవజ్ఞశర్మ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. కేఎస్‌డీ చారిటబుల్ ట్రస్ట్ ఖమ్మం, విశ్వవిఖ్యాత ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అవార్డుకు ఎంపికైన ఉపేందర్‌ను పలువురు అభినందించారు. డ్రాయింగ్ మాస్టర్‌గా రిటైర్ అయిన ఉపేందర్ స్థానికంగా స్పందన ఆర్ట్స్ అసోసియేషన్‌ను స్థాపించి ఏకధాటిగా 13ఏళ్లు గాన గంధర్వుడు ఘంటసాల జయంతిని పురస్కరించుకుని 20మంది సినీ ప్రముఖులను సత్కరించారు. సాంస్కృతిక, పాటల పోటీలు నిర్వహించి యువకులను ప్రోత్సహించిన నేపథ్యంలో ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

క్రైం కార్నర్

పండుగపూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం
- గోవర్ధనగిరిలో బైక్‌ను ఢీకొట్టిన కారు
- ఆయిల్ కంపెనీలో ఆఫీస్ అసిస్టెంట్, సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న మృతులు



సంపత్ నారాయణ రెడ్డి(ఫైల్)



కడార్ల రవిందర్(ఫైల్)

రఘునాథపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వేళ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. దాంతో జనగామ జిల్లా రఘునాథపల్లి గోవర్ధనగిరి విషాదం నెలకొంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

గోవర్ధనగిరికి చెందిన సంపత్ నారాయణ రెడ్డి(57), జనగామకు చెందిన కడార్ల రవిందర్(59) గోవర్ధనగిరి శివారులో ఉన్న మహేష్ ఫ్యాట్స్ అండ్ అయిల్స్ కంపెనీలో ఒకరు ఆఫీస్ అసిస్టెంట్‌గా, ఇంకొకరు సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. దీపావళి పండుగ కావడంతో డ్యూటీ పనులను త్వరగా ముగించుకుని కంపెనీ నుంచి నారాయణ రెడ్డి తన ద్విచక్ర వాహనంపై రవిందర్‌తో కలిసి గురువారం సాయంత్రం తమ ఇళ్లకు బయలుదేరారు. గోవర్ధనగిరి బస్టాండు సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న యూటర్న్ వద్ద జనగామ వైపు వెళ్తుండగా, వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు అతివేగంగా బైక్‌ను ఢీ కొంది. దాంతో నారాయణరెడ్డి, రెడ్డి, రవిందర్ రోడ్డుపై ఎగిరి పడి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ద్విచక్ర వాహనంను ఢీకొన్న కారు హైదరాబాద్ వైపునకు వెళ్తే కోమల్ల టోల్ ప్లాజాకు సంబంధించిన సీసీ కెమెరాలో రికార్డు అవుతుందని గ్రహించిన కారు డ్రైవర్ కారును వెనక్కు మలుపుకొని తిరిగి వరంగల్ వైపునకు వెళ్లినట్లు తెలుస్తోంది. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రఘునాథపల్లి సిఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

సెంట్రల్ లైటింగ్ లైట్లు వెలుగకపోవడం...

గోవర్ధనగిరి బస్టాండు సమీపంలోని జాతీయ రహదారిపై ఎన్‌హెచ్‌ఏ ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ లైట్లు రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో వెలుగకపోవడం.. ప్రమాదానికి కారణం కావచ్చునని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నేషనల్ హైవే అధికారులు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన లైట్లు సక్రమంగా వెలిగేటట్లు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నేటి నుంచి విజయోస్తు!



- పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- టెన్త్ క్లాస్ విద్యార్థులకు యాక్షన్ ప్లాన్
- 'విజయోస్తు' విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళిక
- జిల్లాలో 6,447 మంది టెన్త్ విద్యార్థులు

జనగామ కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): టెన్త్‌లో వంద శాతం ఫలితాల సాధనతోపాటు అధికంగా 10/10 జీపీఏ సాధించేందుకు జిల్లా విద్యాశాఖ సమాయత్తమైంది. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించేలా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో 'విజయోస్తు' పేరిట జిల్లా విద్యాశాఖ యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేసింది. నిర్దేశించిన లక్ష్యాల మేరకు జిల్లాలో 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యే విధంగా, ఎక్కువ మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించేటట్లు అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఈ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు.

యాక్షన్ ప్లాన్ అమలు ఇలా...

ఎస్ఎస్‌సీ పరీక్షలలో వంద శాతం ఫలితాల కోసం విజయోస్తు యాక్షన్ ప్లాన్‌ను ఈ విధంగా రూపొందించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పాఠశాలల వేళలకు అదనంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాల ఆధారంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి బాగా చదివే 9ఆపైన జీపీఏ సాధించేవారు, మధ్యస్తంగా చదివే 7- 8జీపీఏ సాధించేవారు, చదువుల్లో వెనుకబడిన వారు అని 3 గ్రూపులుగా విభజిస్తారు.

జట్ల ఏర్పాటు..

అనంతరం బహుళ స్థాయి విద్యార్థులతో జట్టులను ఏర్పరుస్తారు. అన్ని గ్రూపుల విద్యార్థులు ఆ జట్టులో ఉండేలా చర్యలు తీసుకుంటారు. ఒక్కో జట్టుకు ఒక తెలివైన విద్యార్థిని టీం లీడర్‌గా నియమిస్తారు. ప్రతి జట్టును ఒక ఉపాధ్యాయుడు దత్తత తీసుకొని పరీక్షలయ్యేంతవరకు వారి విద్యా ప్రమాణాలు పెంచే విధంగా పర్యవేక్షణ

మిగతా 8వ పేజీలో...

పటిష్ఠంగా అమలు చేస్తాం

కె.రాము, డీఈవో, జనగామ



విజయోస్తు కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలు చేస్తాం. లక్ష్యాల సాధనకు ప్రతి పాఠశాల విధిగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలి. హెచ్‌ఎం నాయకత్వంలో ప్రణాళికకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేయాలి.

జిల్లాలో 6,447 మంది విద్యార్థులు...

జిల్లాలో అన్ని యాజమాన్యాలతో కలిపి ఈ విద్యా సంవత్సరం 6,447 మంది విద్యార్థులు పదవ తరగతి చదువుతున్నారు. గత సంవత్సరం జిల్లాలో 6,692 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 6,569 మంది విద్యార్థులతో 98.16 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జనగామ జిల్లా 4వ స్థానంలో నిలిచింది. ఈసారి ఉత్తీర్ణత శాతం పెంచుతూ రాష్ట్రంలో మొదటి స్థానం కైవసం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తుంది.



గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కాళేశ్వరానికి పోటెత్తిన భక్తులు

మహదేవపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద గురు, శుక్రవారాల్లో భక్తులు పోటెత్తారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకునేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు. ముందుగా నదీస్నానం ఆచరించి స్వామి వారి ఆలయానికి చేరకుఉన్నారు. కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని బిల్వ పత్రాలతో అభిషేకాలు చేశారు. అనంతరం శుభానందదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు చేశారు.

పెరుగుతున్న ఆయిల్‌పామ్ గెలల ధరలు

» టన్నుకు రూ.19,144 » పంట మార్పిడితో లాభం

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చొరవతో ఆయిల్ పామ్ గెలల ధరలు పెరుగుతున్నాయని మానుకోట జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధి కారి జినుగు మరియన్న తెలిపారు. మహబూబాబాద్‌లో శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు రూ. 19,144 వరకు పెరిగిందని, వరి పంటల నుంచి పంట మార్పిడి చేసి ఆయిల్‌పామ్ సాగు చేస్తే అధిక లాభాలు ఉంటాయని తెలిపారు. నీటి వసతి కలిగి రెండున్నర ఎకరాల భూమి ఉన్న ప్రతి రైతుకు పంట మార్పిడి ద్వారా లాభదాయకమైన ఆయిల్‌పామ్ సాగు చేస్తే ఎకరానికి లక్ష వరకు ఆదాయం పొందవచ్చ నని తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగు వల్ల రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతు న్నారని, ఎకరానికి రూ.50 వేల రాయితీ సౌకర్యం ఉంటుందని చెప్పారు. ప్రతి రైతు పొలం గట్లపై, చుట్టూ పెరట్లో పండ్ల తోటల్లో అంతర్ పంటలుగా కూరగాయల సాగు, ఇతర సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందవచ్చన్నారు.

దళితులను విభజించి పాలిస్తున్న మోదీ

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

మరిపెడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పీఎం నరేంద్రమోదీ దళితులను విభజించి పాలిస్తున్నాడని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన మాల మహానాడు పాదయాత్ర శుక్రవారం మరిపెడ మండలానికి చేరుకుంది. మాలలు పిల్లి సుధాకర్‌కు స్థానిక రాజీవ్ గాంధీ సెంటర్లో స్వాగతం పలికారు. మరిపెడ విశ్రాంతి భవనం దగ్గర జరిగిన సమావేశంలో సుధాకర్ మాట్లాడారు. దళిత జాతి ఒక్కటైతే బీజేపీ ఆటలు సాగవని రిజర్వేషన్ల పేరుతో దేశ వ్యాప్తంగా ఎస్సీలను విభజించే కుట్రలు చేస్తున్నారన్నారు. దళితులంతా ఏకమై రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మంద కృష్ణ మాదిగ సైతం దళితులకు రాజ్యాధికారం కోసం తమతో కలిసి రావాలన్నారు. పాదయాత్రలో చిట్టిమల్ల మహేశ్, చందా శ్రీనివాస్, బొడ్డు అశోక్, మెరుగు సంజీవ, ఏనమల రాకేశ్, బెస్త సంజీవరావు, చందా వెంకన్న, బూర్గుల వెంకన్న, అనిల్, వీరన్న, చిన్ని, వెంకటమల్లు, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

నేడు రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

» మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో మూడు రోజుల పాటు నిర్వహణ

» బాస్కెట్‌బాల్, వూషూ ఆడనున్న 800 మంది క్రీడాకారులు, రానున్న 200 మంది అధికారులు

కేసముద్రం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) తెలంగాణ సౌజన్యంతో ఆ ఫెడరేషన్ మహబూబాబాద్ జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్, వూషూ పోటీలు ఈ నెల 2 నుంచి 4 వరకు కేసముద్రం స్టేషన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు బాస్కెట్ బాల్ 17ఏళ్ల విభాగం, వూషూ 17, 19 ఏళ్ల విభాగంలో ఈ పోటీల్లో రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల నుంచి 800 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో ఈ రెండు క్రీడల్లో డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు స్థానిక జడ్పీ ఉన్నత, సెయింట్ జాన్స్ స్కూళ్లలో ఏర్పాట్లు చేశారు. వివిధ జిల్లాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఇక్కడికి రానున్నారు. వీరితో పాటు ఆయా జిల్లాల టీంలకు కోచ్‌లు, మేనేజర్లు, టెక్నికల్ అఫిషియల్స్, రాష్ట్ర పరిశీలకులు, నిర్వహణ కమిటీ అంతా కలిపి 200 మంది అధికారులు హాజరుకానున్నారు. ఇక క్రీడాకారులు, అధికారులకు మూడు రోజుల పాటు భోజన వసతి నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీహైస్కూల్, ఎస్‌వీవీ, సెయింట్ జాన్స్ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు.



కేసముద్రంలో బాస్కెట్‌బాల్ పోటీలకు సిద్ధం చేసిన మైదానం

ఈ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రం, పతకాలను అందజేయనున్నారు. ఇక్కడ ప్రథమ స్థానం సాధించి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20 నుంచి 24 వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాజనందన్‌గాంలో బాస్కెట్‌బాల్, జమ్ముకశ్మీర్‌లో నిర్వహించే వూషు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనన్నారు. ఈ పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలకు పార్లమెంటు, అసెంబ్లీ స్థాయి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



వేలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కడియం శ్రీహరి

» ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత మాదే

» రాష్ట్రాన్ని దివాళా తీయించిన గత ప్రభుత్వం

» స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్ / వేలేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి పేర్కొన్నారు. శుక్రవారం ధర్మసాగర్, వేలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ధర్మసాగర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు.

ధాన్యం ఏ గ్రేడ్ 2,320, బీ గ్రేడ్ 2,300, సన్నరకానికి అదనంగా 500 బోనస్ చెల్లిస్తామన్నారు. రైతులకు రూ.2లక్షలు రుణాలను ఏక కాలంగా మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లు అప్పు చేసి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాళా తీయించిందన్నారు. ఓ వైపు బీఆర్‌ఎస్ చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే, మరో వైపు సంక్షే మ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. కడియం శ్రీహరి మార్క్ కనిపించేలా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. నవంబరు 6 నుంచి తెలంగాణలో కులగణన జరగబోతుం దని పేర్కొన్నారు. ఈ సమగ్ర సర్వేకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదవ కుమార్, డీసీవో, ఎంపీడీవో, తహసీల్దార్, పీఏసీఎస్ డైరెక్టర్లు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అలాగే వేలేరులో పీఏసీఎస్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేయాలని నిర్వాహకులు, అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ యాదవ్‌కుమార్, ఏఈవో రాజశేఖర్, కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి, తహసీల్దార్ కొమి, డైరెక్టర్లు, జడ్పీటీసీ మాజీ సభ్యులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ మండల నాయకులు, సద్దాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి జీఎంగా రాజేశ్వర్‌రెడ్డి

కార్పొరేట్‌కు హబీబ్ హుస్సేన్ బదిలీ



రాజేశ్వర్‌రెడ్డి

కాకతీయఖని, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ హబీబ్ హుస్సేన్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మందమర్రి ఎస్‌వో టూ జీఎంగా పని చేస్తున్న ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి(అడిషనల్ జీ ఎం)ను భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా వస్తున్నారు. ఈ మేరకు యాజమాన్యం శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. హబీబ్ హుస్సేన్‌ను జీఎం(హెచ్‌ఆర్డీ)గా కార్పొరేట్‌కు బదిలీ చేశారు. కొంతకాలంగా డిప్యుటేషన్‌లు, క్వార్టర్ల కేటాయింపుల విషయంలో ఆయనపై పలు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో ఆయనపై బదిలీ వేటువేసినట్లు కార్మిక వర్గాల్లో చర్చ నడుస్తోంది.

నేడు బీసీ కమిషన్ సమావేశం

మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతులు, కులాల అభివృద్ధి, సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణ చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ ఆధ్వర్యంలో నవంబరు 2న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హన్మకొండ కలెక్టరేట్‌లో సమావేశాన్ని నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, ములుగు, జయంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగాం జిల్లాల ప్రజలు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు తమ అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు. బీసీ కమిషన్ సభ్యులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సంచార జాతుల వారి సామాజిక, రాజకీయ, ఆర్థిక, విశ్లేషణపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలోని వివిధ సామాజిక వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా బీసీ కమిషన్ బృందానికి అందజేయవచ్చన్నారు. అభ్యర్థనతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మాట్‌ను పూరించి హన్మకొండ కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు తెచ్చిన తంటా

మొగుళ్లపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనారోగ్యం బారిన పడిన బాధితులకు అండగా ఉండేందుకు కల్పించిన ముఖ్యమంత్రి సహాయనిధి రెండు కుటుంబాల మధ్య గొడవకు కారణమైంది. మొగుళ్లపల్లి మండలం చింతపల్లి గ్రామానికి చెందిన లడే సమ్మక్క భర్త రాజీరు అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. దీంతో ఆ బిల్లులతో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కొన్ని నెలల క్రితం సమ్మక్క, రాజీరు అనారోగ్యంతో మృతిచెందారు. ఇటీవల ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమ్మక్కకు రూ.25వేలు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరు చేయించారు. అయితే.. ఆ చెక్కును ఇదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లడే సమ్మక్కతో పాటు కాంగ్రెస్ నాయకుడు కలిసి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ నుంచి తీసుకుని పరకాలలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో జమ చేసి రూ.25వేలు డ్రా చేశారు.

ఈ విషయం ఆలస్యంగా తెలియడంతో వారిని గ్రామ పెద్దలు ప్రశ్నించారు. దీంతో సమ్మక్క ఆచెక్కు తమదేనని వాదించింది. తర్వాత ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌కు వెళ్లి అక్కడ తెలుసుకోగా లడే సమ్మక్క భర్త రాజీరుదేనని తేలింది. అయినప్పటికీ మాజీ సర్పంచ్ లడే సమ్మక్క డబ్బులు ఇవ్వకపోవడంతో ఆమెతో పాటు కాంగ్రెస్ నాయకుడిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి కుమారులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై అశోక్ విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

రేగొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా రేగొం డ మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకుడు బుచ్చమా చార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం సుదర్శన నరసిం హ హోమం, అభిషేకం చేశారు. అనంతరం స్వామివారి కల్యా ణాన్ని మేళవాయిద్యాల మధ్య వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని వీక్షిం చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి భక్తులు మొక్కులు చెల్లిం చుకున్నారు. స్వామివారి జన్మ నక్షత్రం స్వాతిలో ప్రతి ఏడాది కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ.



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా రాజు



కన్నాయిగూడెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని చింతగూడెం ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వర్తిస్తున్న రైతు రాజును నియమించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్ చేతుల మీదుగా ఆయన శుక్రవారం నియామకపత్రం అందుకున్నారు.

భద్రకాళి మాడ వీధుల పరిశీలన



మాడ వీధుల నిర్మాణం జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కుడా అధికారులు

వరంగల్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి ఆలయం చుట్టు నిర్మించే మాడ వీధుల ప్రాంతాలను శుక్రవారం కుడా అధికారులు పరిశీలించారు. మాడ వీధులు నిర్మాణం జరిగే ప్రాంతాల్లో ఆలయ ఈవో అర్చకులతో కలిసి సమీక్షించారు. అలాగే అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుడా అధికారులు అజిత్‌రెడ్డి, ఇంజనీర్లు, ఈవో శేషు భారతి, అర్చకులు భద్రకాళి శేషు తదితరులు పాల్గొన్నారు.

పండుగ సందర్భంగా ఆలయంలో భక్తుల సందడి

దీపావళి పర్వదినం సందర్భంగా గురు, శుక్రవారాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంతం కిటకిటలాడింది.

అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : డీఏవో

పెద్దవంగర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఫర్టిలైజర్ దుకాణాల్లో అనుమతిలేని, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మానుకోట జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రోమోర్, ఫర్టిలైజర్ దుకాణాల్లో విత్తన నిల్వలు, నాణ్యత, రిజిస్టర్లు, బొమ్మకల్ గ్రామంలో 2024-వానకాలం పంటల పునఃపరిశీలన కార్యక్రమంలో పలు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా వానాకాలం, యాసంగిలో రైతులు సాగు చేసే పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు రసీదు తీసుకోవాలని సూచించారు. కాలం చెల్లిన, నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై పీడీ కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గుగులోత్ స్వామినాయక్, ఏఈవో యశస్విని తదితరులు పాల్గొన్నారు.



పెద్దవంగర మండల కేంద్రంలోని గ్రోమోర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో విజయనిర్మల

మాజీ మంత్రి ఎర్రబెల్లిపై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



దేవరుప్పులలో దయాకర్‌రావుపై ఎస్సై సృజన్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేవరుప్పుల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సిగ్నేచర్ స్టూడియో యాంకర్ ఉపేందర్‌లపై కేసు నమోదు చేయాలని మండల కాంగ్రెస్ శ్రేణులు గురువారం దేవరుప్పుల ఠాణాలో ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి దయాకర్‌రావు ప్రోద్బలంతో ఉపేందర్ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డిలను అవమానపరుస్తూ, ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసారాలు చేస్తున్నాడని ఆరోపించారు. ఈ సందర్భంగా దేవరుప్పుల ఎస్సై ఊర సృజన్‌కుమార్‌కు ఫిర్యాదుతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, నాయకులు ధర్మారెడ్డి, రవీందర్, రమేష్, యాకస్వామి, వెంకన్న, రవి, నర్సయ్య, సత్తయ్య, అనిల్, రాజేందర్, నరేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

• పాలకుర్తి : సిగ్నేచర్ స్టూడియో యాంకర్ ఉపేందర్, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడానికి బాధ్యుడైన మాజీ మంత్రి దయాకర్‌రావుపై శుక్రవారం కేసు నమోదు చేయాలని కోరుతూ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు లావుడ్యా భాస్కర్, సేవాదళ్ రాష్ట్ర నాయకుడు గుగ్గిల్ల ఆదినారాయణ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జల్లం కుమారస్వామి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేకనే దయాకర్‌రావు ఉపేందర్‌ను ఉసిగొల్పి అనుచిత వ్యాఖ్యలు చేయించారని విమర్శించారు. వారి వెంట బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మాజీ దేవస్థానం చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి, గాదెపాక భాస్కర్ తదితరులు ఉన్నారు.

అమరుల ఆశయ సాధనకు ఉద్యమించాలి

సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకన్న, జిల్లా కార్యదర్శి ఐలయ్య

మహబూబాబాద్ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అమరుల ఆశయ సాధన కోసం ఉద్యమిద్దామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మండల వెంకన్న, జిల్లా కార్యదరి గౌని ఐలయ్యలు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ శ్రీరంగదాసు స్మారక స్థూపం వద్ద శుక్రవారం పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. భూమి కోసం.. భుక్తి కోసం.. ముక్తి కోసం సాగుతున్న విప్లవోద్యమంలో నవంబర్ మాసంలో అనేక మంది అమరులయ్యారని తెలిపారు. ఎన్‌కౌంటర్, మాఫియా గుండాల చేతిలో రివిజనిస్టుల, అతివాదుల చేతిలో అనేకమంది అమరులయ్యారని పేర్కొన్నారు. వారి ఆశయాలను కొనసాగించేందుకు నవంబరు 1 నుంచి 9 వరకు గ్రామగ్రామాలన సంస్మరణ సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో హెచ్.లింగన్న, గుజ్జు దేవేందర్, భట్టు చైతన్య, సామ పాపయ్య, బోనగిరి మధు, పర్వత కోటేష్, లక్ష్మయ్య, జబ్బార్, కవిత, భట్టు భిన్నమ్మ, పొన్నం రమ, యాకయ్య, రజిత, మునిత, కల్పన, కృష్ణ ఉప్పలయ్య, వేణు, శ్రీను, నాగరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

• మహబూబాబాద్‌లో నిర్వహించిన ప్రజాపంథా సమావేశంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న భూమికావాలని, పని కావాలని ఈ దేశంలో సమసమాజం ఏర్పాడలనే లక్ష్యంతో సాగిన విప్లవ పోరాటంలో వేలాది మంది అమరులయ్యారని వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం, ముంజంపల్లి వీరన్న, సైండ్ల యాకయ్య, బండపల్లి వెంకటేశ్వర్లు, రాములు, పాపారావు, అవుల కట్టయ్య, రంగయ్య, ఎల్లయ్య, బలరాం, కొమురయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్డీ నాయకులు

• మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎన్డీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా నాయకులు ఎస్.కె.బాబన్న, మదార్‌లు మాట్లాడారు. భూమికోసం.. భుక్తికోసం.. ఈ దేశ విముక్తి కోసం జరిగిన పోరాటంలో అనేక మంది అమరులయ్యారని చెప్పారు. ఈ సమావేశంలో భాస్కర్‌రెడ్డి, బానోత్ దేవేందర్, పాపన్న, నర్సిరెడ్డి, లింగయ్య, అయిలయ్య, సరిత, స్వరూప, జ్యోతి, రజిత, పాపయ్య, ఉమ పాల్గొన్నారు.

విరజిమ్మిన వెలుగులు

- ఉత్సాహంగా దీపావళి పర్వదినం
- భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతాలు, ధనలక్ష్మీ పూజలు
- ఇంటింటా సందడే సందడి
- వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు


కళాకారిణి శ్రావణి


కళాకారిణి హిమాన్వి

హనుమకొండ కల్చరల్ / వరంగల్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మన సంస్కృతిని ప్రతిబింబించే ముఖ్యమైన పండుగల్లో ఒకటైన దీపావళి పర్వదినాన్ని ప్రజలు గురు, శుక్రవారాల్లో ఉత్సాహంగా జరుపుకొన్నారు. అలాగే కేదారేశ్వర వ్రతాలు, ధనలక్ష్మీ పూజలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు ప్రముఖులు దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. గురువారం తెల్లవారు జామునే ప్రజలంతా అభ్యంగనస్నానాలు ఆచరించి ఆడబిడ్డల నుంచి మంగళ హారతులను అందుకున్నారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ఇష్ట దైవాలకు పూజలు చేశారు. రాత్రి వేళలో ధనలక్ష్మీ పూజలు చేశారు. హనుమకొండ చౌరస్తాలోని అన్ని ప్రధాన వ్యాపార సంస్థల్లో గురువారం రాత్రి ధన లక్ష్మీ పూజలను నిర్వహించి పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం నగర వాసులతో పాటు జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లోను కేదారేశ్వర వ్రతాలను జరుపుకున్నారు. నువ్వుల నూనెతో మట్టి ప్రమిదలతో వత్తులు వేసి నేత్ర పర్వంగా దీపాలను వెలిగించి చీకట్లను పారదోలి ప్రజలంతా పర్వదిన విశిష్టతను చాటారు. నగరంలోని గణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహా మంగళం, కుంభ, కాగడ హారతులు అమ్మవారికి నివేదించారు. ఈ వేడుకలకు వెయ్యి మంది భక్తులు హాజరయ్యారు. 1008 దీపాలతో దీపోత్సవాన్ని ఆచరించి భక్తులకు ధనార్జన నాణాన్ని ప్రసాదంగా అందించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ ట్రస్టీ వైవీ వామన రావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకు లక్ష్మీ అమ్మ వారి నాణాలను బహూకరించారు. నగరంలోని అపార్ట్‌మెంట్లలో ఇతర అన్ని ప్రాంతాల్లో దీపావళి వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సారి కొత్త నోములకు కూడ అవకాశం రావడంతో శని, ఆదివారాల్లో కూడా కొందరు నోముకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అలాగే నగరంలోని అన్ని అమ్మవారి దేవాలయాల్లో దీపాలు వెలిగించి అలంకరణలు జరిపి విశేష పూజలు జరిపించారు.


రంగవల్లులను తీర్చిదిద్ది దీపాలు వెలిగిస్తున్న దృశ్యం

వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో కుటుంబసభ్యులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. బాణసంచా కాల్చి సందడి చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి దీపావళి పర్వదిన వేళ మల్లికాంబ మానసిక, దివ్యాంగ చిన్నారులతో కలిసి వేడుకలు జరుపుకొన్నారు. చిన్నారులకు స్వీట్లు తినిపించి కాకర వత్తులను కాల్చి ఉత్సాహం నింపారు. నగర మేయర్ గుండు సుధారాణి నగరంలోని ఆమె నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు హనుమకొండలోని తన నివాసంలో దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు.

క్రీడ



చెస్‌లో దేవాన్ష్‌రెడ్డి ఉత్తమ ప్రతిభ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని రాంనగర్‌కు చెందిన భైరి రఘువీరారెడ్డి- దివ్యారెడ్డిల ఆరేళ్ల కుమారుడు భైరి దేవాన్ష్‌రెడ్డి చెస్‌లో అంతర్జాతీయ స్థాయి రాపిడ్‌లో రేటింగ్ సాధించారు. ఇటీవల తెలుగురాష్ట్రాల్లో నిర్వహించిన పీడే అంతర్జాతీయ స్థాయి రాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో అంతర్జాతీయ స్థాయి 1485 రేటింగ్ సాధించడం విశేషం. కొన్ని నెలల క్రితం ప్రైవేటు స్కూల్‌లో 1వ తరగతి చదువుతూ, రాంనగర్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్ కోచ్ వద్ద దేవాన్ష్‌రెడ్డి ఓనమాలు దిద్దుకున్నాడు. తల్లిదండ్రుల వద్దనే చెస్‌లో మెళకువలు నేర్చుకొని అంతర్జాతీయస్థాయిలో రాణించడం గమనార్హం. చెస్‌లో గ్రాండ్ మాస్టర్ అవడమే తన లక్ష్యమని దేవాన్ష్‌రెడ్డితో పాటు తల్లిదండ్రులు రఘువీరారెడ్డి- దివ్యారెడ్డి తెలిపారు. వరంగల్ జిల్లా చదరంగ సమైక్య సభ్యులు కన్నా, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్ దేవాన్ష్‌రెడ్డిని అభినందించారు.

ప్రారంభమైన దీపావళి బతుకమ్మ

- మొదటి రోజు కేదారీశ్వరస్వామి వ్రతం
- కుంటకు చేరి బంక మట్టి సేకరణ
- జోడెద్దుల ప్రతిమల తయారీ

సంప్రదాయం


బంక మట్టిని సేకరించి తిరిగి వస్తున్న నేతకాని కులస్థులు

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోనే వినూత్న రీతిలో మూడు రోజుల పాటు నిర్వహించే సీతంపేట నేతకాని కులస్థుల దీపావళి బతుకమ్మ వేడుకలు శుక్రవారం సాంప్రదాయం బద్ధంగా ప్రారంభమయ్యాయి. కేదారీశ్వరస్వామి వ్రతంతో ప్రారంభమయ్యే ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాలలో స్థిరపడిన సీతంపేటకు చెందిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామానికి చేరుకోవడంతో ఊరంతా కోలాహలంగా మారింది. దీపావళి పర్వదినం రోజు ప్రారంభం కావాల్సిన ఈ వేడుకలు అనివార్య కారణాల వల్ల మరుసటి రోజు (మొదటి రోజు) శుక్రవారం ప్రారంభమయ్యాయి. పురుషులు ఊరు శివారులోని కుంటకు చేరుకొని బంక మట్టిని సేకరించి జోడెద్దుల ప్రతిమలను తయారు చేశారు. ఇంట్లో రకరకాల పిండి వంటలతో తయారు చేసిన నగలు (నాగళి, కోల, దుత్తలు, గొడుగు) వంటి వ్యవసాయ పనిముట్లను జోడెద్దులకు అలంకరించి కుటుంబ సభ్యులంతా కలిసి కేదారీశ్వరస్వామి వ్రతం పూర్తి చేశారు.


పిండి వంటలతో తయారు చేసిన నగలు

నేడు జోడెద్దుల ప్రతిమల నిమజ్జనం

మూడు రోజుల పాటు గ్రామంలో జరిగే నేతకాని కులస్థుల దీపావళి బతుకమ్మ వేడుకల్లో రెండో రోజు శనివారం పురుషుల ఘట్టం ప్రారంభమవుతుంది. ఆ రోజు సాయంత్రం కేదారీశ్వర వ్రతం ముందు ఏర్పాటు చేసిన జోడెద్దుల ప్రతిమలకు ప్రత్యేకంగా అలంకరించిన నగలతో కూడిన ప్రతిమలను కోలాటాలతో ఊరేగింపుగా ఊరు శివారులోని కుంటకు చేరుకుంటారు. అనంతరం కుంట వద్ద జోడెద్దుల ప్రతిమలకు కుల పెద్దలు ఆరగింపు చేసి పిండి వంటలతో చేసిన నగలను ఒకరికొకరు తినిపించుకొని వరుసైన వారితో (మగవారు మాత్రమే) సరసాలాడి రంగులు చల్లుకొని జోడెద్దులను నిమజ్జనం చేయడంతో రెండోవ రోజు ఘట్టం ముగుస్తుంది.

రేపటితో ముగియనున్న వేడుకలు

తెలంగాణ ప్రాంతంలో దసరాకు ముందు రోజు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు సాంప్రదాయబద్దంగా తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకంగా జరుగుతాయి. అయితే మహారాష్ట్ర నుంచి వలుస వచ్చిన నేతకాని కులస్థులు మాత్రం ఒక్క హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేటలో ఒక్క నేతకాని కులస్థులు మాత్రమే దీపావళి బతుకమ్మ వేడుకలు దీపావళి పర్వదినం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించుకోవడం వినూత్న ఆచారంగా వస్తోంది. ఇక్కడి ప్రాంత నేతకాని కులస్థుల ప్రత్యేకత దీపావళి బతుకమ్మ కావడంతో ఇతర రాష్ట్రాలలో స్థిరపడిన వారి కులస్థులు, బంధువులు పెద్ద ఎత్తున సీతంపేటకు తరలివస్తారు. ఈ పండుగను అత్యంత ప్రాధాన్యంగా జరుపుకుంటారు.


కోలాటాలతో జోడెద్దుల ఊరేగింపు (ఫైల్ ఫొటో)

మూడో రోజు ఆదివారం తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మను కేదారీశ్వరస్వామి ముందు ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులంతా ప్రత్యేకంగా పూజిస్తారు. అనంతరం బతుకమ్మతో పాటు పసుపుతో చేసిన గౌరమ్మను, రకరకాల పిండి పదార్థాలను (సద్దిని) వెంట తీసుకొని మహిళలు ఊరేగింపుగా ఊరు శివారులోని చెరువు గట్టుకు చేరుకొని బతుకమ్మ ఆటపాటలతో సంబురాలు జరుపుకుంటారు. అనంతరం బతుకమ్మపై ఏర్పాటు చేసిన గౌరమ్మను వాయినం ఇచ్చి పుచ్చుకొని వారి వెంట తెచ్చుకున్న సద్దిని పంచుకొని ఒకరికొకరు తినిపించుకుంటారు. అనంతరం గౌరమ్మను (బతుకమ్మను) చెరువులో నిమజ్జనం చేయడంతో మూడు రోజులు నిర్వహించే నేతకాని కులస్థుల దీపావళి బతుకమ్మ వేడుకలు ముగుస్తాయి.


కాళేశ్వరంలోని ముక్తీశ్వర స్వామి ఆలయం

ఆధ్యాత్మికం

శివకేశవుల ప్రీతికరం.. కార్తీకం

- నేటినుంచి కార్తీక మాసం ప్రారంభం
- ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- నెల రోజుల పాటు దీపోత్సవాలు, వ్రతాలు, వన భోజనాలు

వరంగల్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శివ కేశవుల ప్రీతికరమైన కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభం కాబోతోంది. శుభముహూర్తాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతాలకు నెలవైన ఈ నెలంతా.. వనభోజనాలు, దీపోత్సవాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. శనివారం నుంచి కార్తీక మాస ప్రత్యేక పూజల కోసం ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. కార్తీక మాసంలో శివుడు, విష్ణువుకు విశేష పూజలు నిర్వహిస్తారు. శివాలయాల్లో నిత్యం నమక చమక రుద్రపారాయణాలతో శివుడికి అభిషేకం నిర్వహిస్తారు. ఈ మాసంలో వచ్చే ప్రతీ సోమవారం భక్తులు శివుడికి అభిషేకం నిర్వహించి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉండి రాత్రి ఆకాశంలో నక్షత్రాలు చూసిన అనంతరం దీపాలు వెలిగించి భోజనాన్ని స్వీకరిస్తారు. అలాగే కార్తీక మాసంలో లక్ష్మీదేవి.. దీపం పరబ్రహ్మ స్వరూపమై కొలువై ఉంటుందని ఆలయాలు, ఇంటింటా దీపాలు వెలిగిస్తారు. ఈ నెలలో ప్రత్యేకంగా ఏకాదశి పర్వదినం, కార్తీక పౌర్ణమి, బహుళ అష్టమి రోజుల్లో సత్యనారాయణ స్వామి వ్రతాలు, అష్టసిద్ధులతో కూడిన అనఘాష్టమి వ్రతాలను ఆచరించుకుంటారు. ఇవే కాకుండా కుంకుమ పూజలు, వాయినాలు అందిస్తారు. ఆహ్లాదకరమైన నేపథ్యంలో ఇంటిల్లిపాది కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి వన భోజనాలకు వెళ్తారు. ఉసిరి చెట్టుకింద దీపాలు వెలిగించి చెట్టుకింద కూర్చొని భోజనం చేస్తే ఎంతో పుణ్యఫలమని నమ్మకం. అలాగే నెల రోజుల పాటు రోజుకొక అధ్యాయం చొప్పున కార్తీక పురాణ పారాయణాన్ని నిర్వహిస్తారు.

కాళేశ్వరం, కోటగుళ్లలో ప్రత్యేక పూజలు

మహదేవపూర్ / గణపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిలింగాలలో ఒకటైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర ఆలయానికి కార్తీక శోభ సంతరించుకుంది. శివుడికి ప్రీతికరమైన కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభం కానుండగా నెలంతా శివుడికి ప్రత్యేక పూజలు జరగనున్నాయని అర్చకులు తెలిపారు.



దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు కార్తీక మాసం ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి సామూహిక దీపోత్సవం ఉంటుంది. సోమవారాలు, 15వతేదీ కార్తీక పౌర్ణమి రోజుల్లో సామూహిక సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించనున్నారు. 12, 15వతేదీల్లో మంగళ వాయిద్యాలతో పంచరత్నాలతో గోదావరి వద్ద హారతి కార్యక్రమం ఉంటుంది. 14న వైకుంఠ చతుర్దశి సందర్భంగా రాత్రి 8 గంటల నుంచి భజన, ప్రవచన కార్యక్రమం ఉంటుంది. 15న సాయంత్రం 4 గంటల నుంచి దేవాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు, 7 గంటలకు జ్వాలా తోరణం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అలాగే గణపురం మండలంలోని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో కార్తీకమాసోత్సవాలు శనివారం నుంచి ఘనంగా జరుగనున్నాయి. నెలరోజుల పాటు కొనసాగే కార్యక్రమాల్లో భాగంగా కార్తీక వనభోజనాలు, గోమాతలకు పూజలు, సత్యనారాయణవ్రతాలు నిర్వహించనున్నట్టు అర్చకుడు నాగరాజు తెలిపారు. ఏటా సుమారు 10వేల మట్టి ప్రమిదలతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.



హనుమకొండ బస్టాండ్ రోడ్డులోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం



చేయూత

ఆర్థిక స్వావలంబన దిశగా.. వృత్తి నైపుణ్య శిక్షణ

నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యువతలో అంతర్లీనంగా దాగిఉన్న నైపుణ్యాలకు మెరుగులు దిద్ది వారిని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వృత్తి నైపుణ్య శిక్షణనందిస్తోంది. ఈ క్రమంలో హనుమకొండ బస్టాండ్ రోడ్డు, కాకతీయ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న కేంద్రాల్లో స్వయం ఉపాధి వృత్తి నైపుణ్య కోర్సుల్లో చేరేందుకు 18నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన నిరుద్యోగ యువత ఆసక్తి చూపుతోంది. హనుమకొండ జిల్లా యువజన క్రీడల అభివృద్ధి సంస్థ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని యువతీ, యువకులు వివిధ కోర్సుల్లో రాణించి అనతికాలంలోనే జీవితాల్లో ఆర్థికంగా స్థిరపడుతున్నారు.

పదోతరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు కంప్యూటర్ ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, బ్యూటీషియన్, టైలరింగ్, మగ్గం వర్క్, ఎలక్ట్రీషియన్, ఎయిర్ కండీషన్, రిఫ్రిజిరేటర్ రిపేరింగ్, సీసీ టీవీ ఇన్‌స్టాల్, మొబైల్ సర్వీసింగ్, తదితర కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ అందిస్తున్నారు. వీటిలో శిక్షణ పొందడానికి నామమాత్రపు రుసుము వసూలుచేయడంతో పాటు సెలవు దినాలు, పండగ సెలవులు మినహాయించి ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ అందస్తున్నారు. నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న సెట్వార్ శిక్షణ కేంద్రంలో ఇప్పటికీ 18బ్యాచ్‌లకు శిక్షణ అందించగా, ఇందులో ప్రతిభ కనబర్చిన పలువురు యువత స్వయం ఉపాధిని పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ప్రధానంగా మహిళలు తమకు నచ్చిన ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం, టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సుల్లో నైపుణ్య పాఠాలను నేర్చుకొని ఆర్థికంగా బలపడేలా ఆసక్తిని చూపిస్తున్నారు.

ఉద్యోగావకాశాలు

వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో మూడు నెలల పాటు తాము ఎంచుకున్న రంగంలో శిక్షణ పొందిన తర్వాత నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో వచ్చే సర్టిఫికెట్ ద్వారా ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంటుంది. ప్రధానంగా వివిధ ప్రైవేటు సంస్థలు నిర్వహించే జాబ్ మేళాలో వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ పొందిన యువతకు ముందుగా ప్రాధాన్యం కల్పిస్తారు. అదేవిధంగా వృత్తి నైపుణ్య కోర్సుల్లో ప్రతిభ ఆధారంగా స్వయం ఉపాధిని పొందడానికి యువతకు చాలా అవకాశాలు ఉంటాయి. వృత్తి నైపుణ్య కోర్సుల్లో చేరడానికి డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువత సైతం ఈ ఉపాధి కోర్సుల్లో చేరడానికి ఆసక్తిని కనబరుస్తున్నారు.

కుట్టు మిషన్లు, బ్యూటీషియన్ కోర్సులకు ఆదరణ

- విజయశ్రీ, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం సూపరింటెండెంట్



వృత్తి నైపుణ్య కేంద్రంలో మహిళలు కుట్టు మిషన్లు, బ్యూటీషియన్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీటిలో రాణించి స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. వీరికి జాబ్‌మేళాల్లో ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రం ప్రారంభం నుంచి నేటి వరకు 629 మంది శిక్షణ తీసుకోగా, వారిలో కొందరు ప్రభుత్వసంస్థల్లో ఉపాధి పొందగా, మరికొందరు తాము ఎంచుకున్న రంగంలో స్వయం ఉపాధి పొందుతున్నారు.

మహిళలకు శిక్షణ అందిస్తున్నా..

- ఇమ్మడిశెట్టి గాయత్రి, భీమారం హనుమకొండ.



ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెంట్ మేకింగ్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ పొందా. ఆ తర్వాత భీమారంలో నూతనంగా మగువ లేడీస్ టైలర్‌ను నెల కొల్పి డిజైనర్ బ్లౌజులు రూపొందించడంతో పాటు ఆసక్తి కలిగిన మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ అందిస్తూ నెలకు రూ.30వేల వరకు సంపాదిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నా. హ్యాండ్ ఎంబ్రాయిడరీతో పాటు మగ్గం వర్క్‌లో ప్రావీణ్యం పొందడంతో పెద్ద మొత్తంలో ఆర్డర్లు వస్తున్నాయి.

రూ.18వేలు సంపాదిస్తున్నా..


- టి.శేఖర్, పత్తిపాక, శాయంపేట మండలం.



మూడు నెలల పాటు ఎలక్ట్రీషన్ కోర్సులో శిక్షణ పొందా. ఇందులో ప్రావీణ్యం పొందాక మా ఊరిలో నూతనంగా నిర్మించే భవనాలకు హౌస్ వైరింగ్‌తో పాటు స్విచ్‌బోర్డులు, గీజర్, రైస్ కుక్కర్లు, ఫ్యాన్లు, మిక్సీలు రిపేరు చేస్తూ నెలకు సుమారు రూ.18వేల వరకు సంపాదిస్తూ జీవనోపాధి పొందుతున్నా.

టైలరింగ్‌లో శిక్షణ అందించా...

- సోమ శైలజ, టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షకురాలు



ప్రస్తుతం మహిళలు బ్లౌజులపై డిజైన్ల కోసం హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్‌పై మక్కువ చూపుతుండటంతో టైలరింగ్ శిక్షణ కోసం మహిళలు ఆసక్తి చూపుతున్నారు. శుభకార్యాల కోసం రూ.వేలకు వేలు వెచ్చించి డిజైన్ బ్లౌజులు కుట్టించుకోవడంతో టైలరింగ్ కోర్సుకు డిమాండ్ పెరిగింది. మూడు నెలల వ్యవధిలో టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసిన మహిళలు.. సొంతంగా తమ ఇళ్లలోనే షాపులు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. వృత్తి శిక్షణ కేంద్రం ప్రారంభం నుంచి నేటి వరకు 300మందికి టైలరింగ్‌లో శిక్షణ అందించా.

డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నా..


- బి.అనూష, నీరుకుళ్ల, ఆత్మకూరు మండలం.



హనుమకొండలోని వృత్తి నైపుణ్యం కేంద్రంలో 11వ బ్యాచ్‌లో మూడు నెలల పాటు కంప్యూటర్ శిక్షణ పొందా. ఎంఎస్ ఆఫీస్ కోర్సులో ఎం ఎస్ వర్డ్, ఎంఎస్ ఎక్సెల్, షార్ట్‌కట్ కీస్ శిక్షణలో రాణించి సర్టిఫికెట్ పొందడంతో ములుగురోడ్డులోని టాటా సెలక్ట్ కంపెనీలో ఉద్యోగం సాధించా. ప్రస్తుతం నెలకు రూ.12వేల వేతనం రావడంతో కుటుంబానికి బాసటగా నిలవడం చాలా సంతోషంగా ఉంది.

ఉత్తమ దర్యాప్తునకు ప్రశంస

- డీఎస్పీ సత్యనారాయణకు యూనియన్ మెడల్


సత్యనారాయణ

హనుమకొండ టౌన్ , నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహిళపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనలో నిందితులను సకాలంలో పట్టుకొని, వారికి ఉరిశిక్ష పడేలా దర్యాప్తులో ఉత్తమ ప్రతిభ చూపిన వరంగల్ ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఆడెపు సత్యనారాయణ కేంద్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపికయ్యారు. 2019లో ఆసిఫాబాద్ జిల్లాలో ఓ మహిళను గ్యాంగ్ రేప్ చేసి కిరాతకంగా హత్య చేసిన ముగ్గురు వ్యక్తులను నాడు ఆసిఫాబాద్ డీఎస్పీగా పనిచేస్తున్న సత్యనారాయణ సకాలంలో పట్టుకొని ఏడాది వ్యవధిలోనే ముగ్గురికి ఉరిశిక్ష పడేలా సాక్ష్యాలను కోర్టులో సమర్పించారు. సత్యనారాయణ దర్యాప్తు చేసిన తీరు, ఆయన చేసిన కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకమైన యూనియన్ మెడల్ అవార్డుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఎంపిక చేసింది. త్వరలో ఢిల్లీలో జరగబోయే ఓ కార్యక్రమంలో సత్యనారాయణ ఈ అవార్డు అందుకోనున్నారు. దీంతో నర్సంపేట మండలం తిమ్మంపేటకు చెందిన సత్యనారాయణను గ్రామస్తులు, బ్యాచ్‌మేట్స్ అభినందించారు.

పశువైద్యశాలపై పట్టింపేదీ?

● నిరుపయోగంగా భవనం ● రూ.21లక్షల ప్రజాధనం వృథా



స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పశువైద్య శాలను పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షలు వెచ్చించి వైద్యశాల నిర్మించినా మౌలిక వసతులు కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారిందని వాపోతున్నారు. మూగజీవాల సమస్యల్ని పరిష్కరించేందుకు ఇప్పగూడెంలో శివారులో పశుసంవర్ధకశాఖ ద్వారా మంజూరైన రూ.18లక్షలతో 2019లో పశువైద్యశాలను నిర్మాణానికి పనులు ప్రారంభించారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో వైద్యశాల నిర్మాణ పనులను చేబట్టి 2020లో పనులను పూర్తి చేశారు. అయితే నిర్వహణకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రజలు, స్థానికులు ఒత్తిడి తెచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ముళ్లచెట్లు పెరిగి మందుబాబులకు, పేకాటరాయుళ్లకు అడ్డగా మారిందని స్థానికులు వాపోతున్నారు. అంతేకాదు, అకతాయిలు కిటికీలను, డోర్లను ధ్వంసం చేశారు.

ఏకరూప రంగులో మార్చేందుకు 3లక్షలు...

మార్చి 2023లో అప్పటి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పశువైద్యశాలలను ఏకరూప రంగులోకి మార్చాలని కోరుతూ జీవో జారీ చేయడంతోపాటు మరమ్మతులకు ప్రభుత్వం రూ.3లక్షలు మంజూరి చేసింది. అప్పటికే శిథిలావస్తకు చేరుకున్న వైద్యశాలకు రూ.3లక్షలు వెచ్చించి నూతనంగా కిటికీలు, డోర్లను అమర్చి 2023 జూలై వరకు సుందరీకరించారు. పూర్తిగా దెబ్బతిన్న వైద్యశాలను ప్రభుత్వ నిధులు రూ.3లక్షలు వెచ్చించి సుందరీకరించి ప్రారంభించకుండానే మళ్లీ వదిలేశారు. నిర్మాణానికి రూ.18 లక్షలు, సుందరీకరణకు రూ.3లక్షలు కలిపి రూ.21లక్షల వెచ్చించింది. అయినా వినియోగంలోకి రావడంతో ప్రజాధనమంతా వృథా అయింది. ఏడాదిన్నర కాలంలో వైద్యశాల కనిపించని విధంగా ప్రస్తుతం పూర్తిగా ముళ్ల పొదల మధ్య కూరుకుపోయింది.

వినియోగంలోకి తెస్తే మేలు...

ఈ పశువైద్యాశాలను ఉపయోగంలోకి తీసుకువస్తే ఇప్పగూడెం, అక్కపల్లిగూడెం, రంగరాయగూడెం, కోమటిగూడెం, సముద్రాల గ్రామాలకు చెందిన పశువులకు, జీవాలకు ఉపయోగంగా ఉంటుంది, ఎంతో ప్రాధాన్యత కల్గిన పశు వైద్యశాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం దుర దృష్టకరమని రైతులు వాపోతున్నారు.

పశువైద్యం కోసం మండకేంద్రానికి..

వంగపండ్ల మహేందర్, రైతు, ఇప్పగూడెం



పశువులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే ట్రాలీ ఆటోలను కిరాయిలకు తీసుకొని వాటిలో తీసుకువెళ్లి ఘన్‌పూర్‌లో పరీక్షలు చేయించాల్సి వస్తోంది. పశువుల చికిత్స కోసం పడరాని పాట్లు పడుతున్నాం. వైద్యశాలను వెంటనే ఉపయోగంలోకి తీసుకువచ్చి రైతుల ఇబ్బందులు తొలగించాలని. ప్రజాధనమే కదా అని వదిలివేయడం సరికాదు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

చిలుపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందిన ఘటన వంగాలపల్లి సమీపంలో, జాతీయ రహదారిపై గురువారం జరిగింది. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ కథనం ప్రకారం... వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని పోతిరెడ్డిపల్లి శివారు లకావత్‌తండాకు చెందిన లకావత్ రాజమ్మ (61) తన భర్త భీమ్లాతో కలిసి ధర్మసాగర్ మండలంలోని పెద్దపెండ్యాల సమీపంలో ఉన్న మామిడితోటలో కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వ్యక్తిగత పని నిమిత్తం హన్మకొండకు వెళ్లేందుకు వంగాలపల్లి - కరుణాపురం స్టేజీ వద్ద, ఆర్టీసీ బస్సు కోసం వేచి చూస్తున్న రాజమ్మను వెనుక నుంచి మోటార్ సైకిల్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ రాజమ్మను ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కొడుకు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విషంతాగి ఆత్మహత్య



నర్మెట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగా లేక ఓ యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన అమ్మాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై నగేష్ కథనం ప్రకారం అమ్మాపురంనకు చెందిన కుంటి వినయ్ (22) కొద్ది రోజులుగా మానసికస్థితి సక్రమంగా లేక అటు ఇటు తిరుగుతున్నాడు. అక్టోబరు 31న నర్మెటలోని అంగడి వద్ద పురుగులమందు తాగి, విషయాన్ని బంధువులకు ఫోన్ చేశాడు. వారు వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

జనగామ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించి త్రుటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని పాతబీటు బజారులో ఆద్య జ్యువెల్లర్స్‌లో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ప్రమాదవశాత్తు దేవుని దీపం కింద పడడంతో షాపులో మంటలు అంటుకొని పొగలు వచ్చాయి. గమనించిన స్థానికులు యజమాని జక్కోజు శ్రీధర్‌చారికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐలు చెన్నకేశవులు, రాజేశ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పి వేశారు. సంఘటనలో రూ.2.50 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు దగ్ధమైనట్లు యజమాని శ్రీధర్ తెలిపాడు.

న్యూస్ బాక్స్

రైతులకు ప్రభుత్వం అండ



ధాన్యాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

జనగామ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. రైతులకు మార్కెట్ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చెర్మన్ కొల్లూరి నర్సింహులు, డైరెక్టర్లు బన్నీ నాయక్, బొట్ల నర్సింహరావు, నాగబండి రవీందర్, నామాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబేద్కర్ అభయహస్తం అమలు చేయాలి



మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

జనగామ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం అంబేద్కర్ అభయహస్తంను అమలు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు తూటి దేవదానం అధ్యక్షతను జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో లలిత, ఉప్పలయ్య, యాదగిరి, శోభ, మేరి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



కూనూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సోమయ్య

జఫర్‌గఢ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన శుక్రవారం తిమ్మాపూర్, కోనాయిచలం, కూనూరు, రఘునాథ్‌పల్లి గ్రామాల్లోని రైతుల కల్లాల వద్ద ధాన్యపు రాశులను సందర్శించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో రైతు సంఘం ప్రతినిధులు శాగ యాదగిరి, గంగరాజు, శాగ శ్రీనివాస్, వెంకటన్న, కోల శ్రీకాంత్, మహేందర్, సోడియం నాగరాజు, శంకర్, భరత్, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా దివాళి వేడుకలు



స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించి విజయానికి ప్రతీకగా వెలుగు జిలుగుల దీపావళి పండుగను ఆనందోత్సాహాల నడుమ ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. పలువురు ఇళ్లలో, షాపుల్లో ధనలక్ష్మి పూజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అనంతరం రాత్రి వేళ బాణసంచా మోతలతో పిల్లలు, యువకులు హోరెత్తించారు. స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో ఇళ్ల ముందు ప్రతి ఒక్కరు దీపాలు వెలిగించడంతో పండుగ శోభ వెల్లివిరిసింది. బాణాసంచా కాల్చడానికి పిల్లలు, పెద్దలు, యువకులు ఉత్సాహం చూపారు. ఉదయం నుంచే ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ తిరుమల నాథస్వామి దేవాలయం, శివునిపల్లి పట్టణ శ్రీవేంకటేశ్వర ఆలయంలో భక్తులు తెల్లవారు జాము నుంచే ధనలక్ష్మీ పూజలు, దీపారాధన చేశారు. అనంతరం పిల్లలు, పెద్దలు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.



చిలుపూర్ గుట్ట ఆలయంలో స్వామివారికి దీపారాధన

- చిలుపూర్: దీపావళి పురస్కరించుకుని చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో దీపారాధన కన్నుల పండువగా నిర్వహించారు. గురువారం ఆలయ ఆవరణలో చేపట్టిన పూజా కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి శాశ్వత దాత, దేవస్థానం మాజీ చైరన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఆలయ ఈవో మోహన్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, పూజారులు రంగాచార్యులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.
- బచ్చన్నపేట: దీపావళి వేడుకలు మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. సూర్యోదయానికి ముందే హారతులు పట్టే కార్యక్రమం ముగించుకుని మధ్యాహ్నం 3 గంటల తర్వాత ధనలక్ష్మీ పూజలు నిర్వహించారు. ఈ ఏడాది స్వాతి నక్షత్రంలో కేదారేశ్వర నోములు రావటంతో గతంలో నోముకుని పలు కారణాలతో విరమించుకున్న వారు, కొత్తగా నోముకునే జంటలు వ్రతపూజలు జరుపుకున్నారు. సత్యనారాయణస్వామి వ్రతాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.
- రఘునాథపల్లి: దీపావళి అమావాస్య సందర్భంగా వాసవి సేవా సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కంచనపల్లి క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పోకల శివకుమార్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గందె వీరయ్య, వాసవి సేవా సంఘం అధ్యక్షుడు ఓరుగంటి శంకర్‌లింగం, తుమ్మలపల్లి సోమేశ్వర్, బచ్చు శ్రీనివాస్, కూరెళ్ల ఉపేందర్, గందె రవిందర్ పాల్గొన్నారు.
- జనగామ రూరల్: జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్‌డిపోలో లక్ష్మీపూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. డీఎం స్వాతి ఆధ్వర్యంలో లక్ష్మీపూజలు నిర్వహించారు.
- తరిగొప్పుల: మండలంలో దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం కేదారీశ్వర నోములు నోచుకున్నారు. పూలతో దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి, బాణసంచా కాల్చారు.

కుల గణన సమగ్రంగా నిర్వహించాలి : డీపీవో

పాలకుర్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):ఈనెల 6నుంచి జిల్లాలో చేపట్టే కుల గణనను సమగ్రంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి స్వరూప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశానికి డీపీవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కుటుంబ సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కుల గనన సర్వే సమగ్రంగా ఉండాలని ఆదేశించారు. కుటుంబంలో ఎవరైన ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారా ఉద్యోగులు ఉన్నారా ? వారి ఆర్థిక పరిస్థితితోపాటు ఉపాధి అవకాశాలు అందుతున్నాయా అనే కోణాల్లో సర్వే ఉండాలని ఆదేశించారు. ఈసర్వే 6 నుంచి 18 వరకు నిర్వహించాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాములు, ఎంపీవో రవీందర్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వరాచారీ, యుగేందర్, శిరీష్, లింగయ్య, మహేష్, మహేందర్, సంతోష్, సంగీత, ప్రియాంక ఉన్నారు.

- జనగామ: కులగణనపై నేడు జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు కుల గణనపై జిల్లా స్థాయి సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించడం జరుగుతుందన్నారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై దిశానిర్దేశం చేస్తామన్నారు. సమావేశానికి వరంగల్ ఎంపీ కడియం కావ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మామిడాల యశస్వినిరెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జి సింగపురం ఇందిర, పాలకుర్తి ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సిరెడ్డి, జిల్లా నాయకులు హాజరవుతారన్నారు.



మాట్లాడుతున్న డీపీవో స్వరూప

కాస్మెటిక్ చార్జీల పెంపుతో హర్షం

జనగామ కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయాల్లో కాస్మెటిక్, మెస్ చార్జీల పెంపు పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ మెస్ చార్జీలు రూ.1500 నుంచి రూ.2100.ల వరకు, కాస్మెటిక్ చార్జీలు రూ.275 పెంచడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జనగామ జిల్లా కేంద్రంలోని ఎంజేపీ ప్రిన్సిపాల్ ఆకుల శ్రీనివాస్, ఏటీపీ రాజశేఖర్, డీడబ్ల్యూ జానీ పాషా, పెంబర్తి లోని ఎంజేపీ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌పీఎస్.చారి, ఎంటీపీ శ్వేత, డీడబ్ల్యూడీ లావణ్య, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కడియంను కలిసిన సీపీఎం నాయకులు



ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని సీపీఎం నాయకులు శుక్రవారం హన్మకొండలో కలిశారు. లింగాలఘణపురం మండలంలోని కళ్లెంలో డబుల్ బెడ్ రూం ఇండ్లలో నివాసం ఉంటున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలందరికీ డబుల్ బెడ్‌రూంలను ఇస్తానని మాయ మాటలు చెప్పి మోసం చేసిందని మండిపడ్డారు. మూడేళ్ల నుంచిల డబుల్ బెడ్‌రూం ఇండ్లలో మౌలిక వసతులు లేకపోయిన కూడా నిరుపేద కుటుంబాలు జీవనాన్ని కొనసాగిస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాపర్తి రాజు. ఎండీ అతియా సుల్తానా, కానుగంటి విజయ, లావణ్య, మేరీ, శోభ పాల్గొన్నారు.

- జఫర్‌గఢ్: తమ్మడపల్లి(జి)కి చెందిన గాదె సంధ్య కుటుంబానికి ఎమ్మెల్యే శ్రీహరి శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కును హనుమకొండలోని తన నివాసంలో అందజేశారు. పేద కుటుంబానికి చెందిన సంధ్య హైద్రాబాద్‌లోని చికిత్స పొందుతోంది. నాయకుడు ఎం.ప్రభాకర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, కడియం సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.2.25లక్షలు మంజూరు చేయించారు. కార్యక్రమంలో నాయకులు మారెపల్లి ప్రభాకర్, సంపత్, కొంతం లక్ష్మీనారాయణ, గాదె అంబేద్కర్, పులి హరీష్ పాల్గొన్నారు.

వర్షంతో తడిసిన ధాన్యం



బచ్చన్నపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బచ్చన్నపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బచ్చన్నపేటలో శుక్రవారం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. వాహనాల్లో ధాన్యం తరలిస్తుండగా వర్షానికి తడిశాయి. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ బచ్చన్నపేట కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. సివిల్ సప్లయ్ డీఎంతో మాట్లాడి వెంటనే మూడు లారీలు పంపించి కాంటా వేసిన ధాన్యాన్ని తరలించాలని ఆదేశించారు. కాంటా అయిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు పంపించాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట స్పెషల్ ఆఫీసర్, జిల్లా వ్యవసాయాధికారి రామారావు నాయక్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు ఉన్నారు. అనంతరం ఈనెల 6 నుంచి జరిగే సమగ్ర కుటుంబ సర్వే ప్రిపరేషన్‌ను పరిశీలించేందుకు గోపాల్‌నగర్ వెళ్లారు. ఇందుకు సంబధించిన వివరాలను ఎంపీడీవో మల్లిఖార్జున్, పంచాయతీ కార్యదర్శి కవితను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయాధికారి రామారావు నాయక్ తమ్మడపల్లి, గోపాల్‌నగర్‌లో సమగ్ర కుటుంబ సర్వే కోసం సమాయత్తమవుతున్న అధికారులను కలిసి వివరాలు తెలుసుకున్నారు.

ఎర్రబెల్లికి శుభాకాంక్షలు



దయాకర్‌రావుకు స్వీట్లు అందిస్తున్న శ్రీకాంత్

దేవరుప్పుల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు జిల్లా బీఆర్ఎస్ నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ శుక్రవారం స్వీట్లు పంపిణీ చేస్తూ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో దయాకర్ రావు నివాసంలో మర్యాదపూర్వకంగా శ్రీకాంత్ కలిశారు.

నేడు బీసీ రిజర్వేషన్‌పై అభిప్రాయాల సేకరణ

జనగామ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హన్మకొండ కలెక్టరేట్‌లో నేడు బీసీ రిజర్వేషన్‌పై అభిప్రాయాల సేకరణ ఉంటుందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల కల్పనపై నవంబరు 2న(నేడు) ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా హన్మకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అభిప్రాయాల సేకరణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి బీసీ కమిషన్ ప్రతినిధులు హాజరవుతారని అసక్తి కలిగిన వారు ప్రభుత్వ నోటరీ అడ్వకేట్ సంతకంతో అభిప్రాయాలను తెలపాలన్నారు.

బాధ్యతలు చేపట్టిన డీఎంహెచ్‌వో



జనగామ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జనగామ డీఎంహెచ్‌వోగా కె.మల్లికార్జున రావు బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు పనిచేసిన హరీశ్‌రాజ్ మంచిర్యాల డీఎంహెచ్‌వోగా బదిలీ కాగా అయన స్థానంలో జనగామ ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీందర్‌కు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించారు. ఇటీవల డీఎంహెచ్‌వోగా మల్లికార్జున రావును ప్రభుత్వం నియమించగా, ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

విజయోస్తు!

(5వ పేజీ తరువాయి)

చేస్తాడు. ప్రతి రోజు ఉదయం తన జట్టులో ఉన్న విద్యార్థులకు ఉపాధ్యాయుడు వేకప్ ఫోన్ కాల్ చేసి వారు మేల్కొని చదివేటట్లు చేస్తాడు. జట్టులోని విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులందరూ కృషి చేస్తారు.

తల్లిదండ్రులతో సత్సంబంధాలు ...

దత్తత తీసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయుడు నిరంతరం సంబంధాలు నెరపుతూ వారు పిల్లలకు ఇంటి వద్ద చదువుకోవడానికి అనువైన పరిస్థితులు కల్పించవలసిందిగా కోరతారు. వారు అనారోగ్యానికి గురికాకుండా సరైన పౌష్టికాహారం అందించాల్సిందిగా ఎప్పటికప్పుడు సూచిస్తారు. అకాడమిక్ క్యాలెండర్ 2024-25 ప్రకారం డిసెంబరు నాటికి 10వ తరగతి మొత్తం సిలబస్ పూర్తి చేయాలి.

అభ్యాస దీపికల ద్వారా సాధన ...

ప్రత్యేక తరగతులలో ప్రభుత్వం అందించిన అభ్యాస దీపికలలోని అంశాలను సాధన చేయిస్తారు. అభ్యాస దీపికల ప్రశ్నల ఆధారంగా ప్రతి శనివారం వీక్లీ స్లిప్‌టెస్టు నిర్వహిస్తారు. గత సంవత్సరాలకు సంబంధించిన ప్రశ్నపత్రాల సమాధానాలను వచ్చే ఐదు నెలల్లో నెలకొకటి చొప్పున విద్యార్థులకు వివరిస్తారు. చేతిరాత అందంగా ఉండేలా, కొట్టివేతలు లేకుండా జవాబు రాసేలా విద్యార్థులను తీర్చిదిద్దుతారు.

ఉన్నత విద్య అభ్యసించేందుకు కృషి చేయాలి

బొమ్మనబోయిన శ్రీనివాస్, జిల్లా గుణాత్మక విద్య సమన్వయ అధికారి



విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలి. విద్యార్థుల్లో వార్షిక పరీక్షల భయాన్ని నివారించాలి. వచ్చే ఫిబ్రవరిలో అన్ని పాఠశాలల్లోని ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాంను నిర్వహించి వారి అభిరుచికి అనుగుణంగా ఉన్న విద్యావకాశాలపై వారికి పూర్తి అవగాహన కల్పించాలి.

త్వరలోనే రూ.500 బోనస్ : ఎమ్మెల్యే

కొడకండ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని, నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం లక్ష్మక్కపల్లిలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రైతును రాజును చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రైతు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. క్వింటాకు రూ.500 బోనస్‌ను త్వరలోనే అందచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు సురేష్, వెంగల్‌రావు, రాజేష్, మాజీ సర్పంచ్ మధు తదితరులు ఉన్నారు.



లక్ష్మక్కపల్లిలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే